# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 25 పేజీలు: 4 వెల: రూ.4/- శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# వినాయక నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు

## నేడు నగరంలో నిమజ్జనంభారీ స్థాయిలో భద్రత ఏర్పాట్లు

## లక్షల సంఖ్యలో హాజరుకానున్న ప్రజలు




**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

ఆధ్యాత్మిక శోభను నింపిన వినాయక నవరాత్రి ఉత్సవాలు చివరి అంకానికి చేరుకున్నాయి. విఘ్నాలను తొలగించే గణనాథుడు నవరాత్రి ఉత్సవాలను ముగించుకొని భక్తుల జయజయ ధ్వానాల మధ్య గంగమ్మ ఒడిలోకి చేరుకోవడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. బొజ్జ గణపయ్య నిమజ్జనోత్సవానికి సర్వం సన్నద్ధమైంది. మండపాల్లో విశిష్ట పూజలు అందుకున్న వినాయకుడు గంగమ్మ ఒడికి చేరనున్నాడు. గణపతి బప్పా మోరియా.. అంటూ.. గణనాథుడి నామస్మరణతో నగరం మార్మోగనున్నది. శుక్రవారం ఖైరతాబాద్ మహాగణపతి, బాలాపూర్ సహా వివిధ ప్రాంతాల నుంచి హుస్సేన్‌సాగర్ వరకు భారీ గణనాథుల శోభాయాత్ర అత్యంత వైభవంగా జరగనున్నది. ఈ మేరకు నిమజ్జన మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు బల్దియా అన్ని చర్యలు చేపట్టింది. హుస్సేన్‌సాగర్ వద్ద 280 క్రేన్లను ఏర్పాటు చేశారు. పోలీసు, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. ఇదిలా ఉంటే ఖైరతాబాద్ మహాగణపతి దర్శనాలు బుధవారం రాత్రి ముగిశాయి. గురువారం నుంచి నిమజ్జన ప్రక్రియ మొదలుకానున్నది. 25న

..మిగతా 2లో

# నిషేధిత జాబితా చిక్కుముడి వీడింది

## 22ఏ పరిధిలో ఉన్నా రిజిస్ట్రేషన్లు, తక్షణమే అమలు




- నిషేధిత జాబితాలోని సుమారు 300 కాలనీల్లో ఇళ్లు.. ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు వీలు
- స్థానిక సంస్థల అనుమతి ఉన్న వాటికే వర్తింపు
- ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ ఉంటే చాలు
- కీలక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- తక్షణమే రిజిస్ట్రేషన్లు: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

దశాబ్దాలుగా పీటముడిలా ఉన్న నిషేధిత జాబితా చిక్కుముడి వీడింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా కాలం నుంచి 22 ఏ జాబితాలో కొనసాగుతున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లకు శాశ్వత విముక్తి కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 16న శాసనసభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, వివేక్‌లు సమావేశమై చర్చించారు. అనంతరం ప్రభుత్వం 22ఏ పరిష్కారాలపై కీలక నిర్ణయం వెల్లడించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్, పరిసర జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 కాలనీల్లోని 1.41 లక్షల ఇళ్లు, ప్లాట్లకు

..మిగతా 2లో

# దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

## అనర్హత పిటీషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం

## హైకోర్టు తీర్పునకు సమర్ధన



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించిన హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీ తరఫున పోటీ చేయడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు, దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఏమీ లేదని, ఘర్ వాపసీ చట్ట సభలకు వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఆయారాం, గయారాంలు పెరుగుతున్నారని వ్యాఖ్యానించింది. అటు సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

ఒక పార్టీ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని సుప్రీంలో

..మిగతా 2లో



కేసీఆర్.. కుటుంబ సభ్యుల భూములపై..

# విచారణకు ప్రత్యేక కమిటీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

భూ అక్రమాలు, ఆక్రమణల నిగ్గు తేల్చేందుకు శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు.. ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 16 అంశాలపై విచారణ చేయాలని నిర్ణయించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, టి.హరీశ్‌రావులతోపాటు.. వారి కుటుంబ సభ్యులు, మరికొందరు భారాస నేతలకు సంబంధించి ఆయా గ్రామాల్లోనే భూముల వివరాలను విచారణ అంశాల్లో చేర్చింది. వారి అధీనంలోని భూముల్లో ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయి, ఎసైన్డ్, ఇతర భూముల ఆక్రమణలు, కొనుగోళ్లు జరిగాయన్న ఆరోపణల నిగ్గు తేల్చాలని విచారణ కమిటీకి నిర్దేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఉత్తర్వులు జారీచేశారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై

# అభిశంసన తీర్మానం

## విపక్ష పార్టీల సంచలన నిర్ణయం

### ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చేందుకు ప్లాన్.. దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పిలుపు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై విపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ఈ క్రమంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు సిద్ధమయ్యాయి. ఎన్నికల సంఘంలోనే విభేదాలు ఉన్నట్లు జాతీయ మీడియాల్లో వస్తున్న వరుస కథనాల నేపథ్యంలో ఆయనను తొలగించాలని కోరుతున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ ఉభయ సభల్లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఈ అభిశంసన తీర్మానం నోటీసులకు సంబంధించి ముసాయిదా రూపొందించే పనిలో ఉన్నారని, న్యాయ నిపుణుల పరిశీలన తీసుకొని ఒకటి రెండు వారాల్లోగా లోక్‌సభ, రాజ్యసభల్లో నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి కాంగ్రెస్ ఇతర

..మిగతా 2లో



# నేడు అత్యంత భారీ వర్షాలు

## భారీ వర్షాలతో అతలాకుతులమైన ఉత్తరాంధ్ర

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వర్షం దంచికొడుతోంది. ప్రధానంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఈ వర్షాలకు అతలాకుతలమైంది. వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ఈ క్రమంలో రాష్ట్రంలో వర్షపాత వివరాలను రాష్ట్ర విపత్తుల

..మిగతా 2లో

# దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ



**మొదటి పేజీ తరువాయి...**

దాఖలు చేసిన పిటిషన్‌లో దానం నాగేందర్ పేర్కొన్నారు. దానిని ప్రాతిపదికగా తీసుకొని తెలంగాణ హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో ఈ విధంగా వేరే పార్టీ నుంచి పోటీ చేశారన్న కారణంతో బిహార్ రాష్ట్రానికి చెందిన మహాచంద్రప్రసాద్ అనే వ్యక్తిని సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని శాసన సభాపతి ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పును సమర్థించింది.

**సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందన**

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని దానం నాగేందర్ అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం గురువారం తీర్పును వెలువరించిన సందర్భంగా ఆయన స్పందించారు. తనకు ప్రజా క్షేత్రంలో బలం ఉందని తెలిపారు. తాను ప్రతి ఇంటికి సేవ చేశానని వాళ్లను అడిగితే తెలుస్తుందన్నారు. ఉపఎన్నికల్లో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారన్నారు.

"సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. గతంలో మూడు సార్లు గెలిచాను. ఒక ఉపఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. నాకు ప్రజా క్షేత్రంలో బలం ఉంది కలిసి పని చేస్తాం తప్పకుండా గెలుస్తాం. పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు" - దానం నాగేందర్

**ఇదీ కేసు నేపథ్యం**

పార్టీ ఫిరాయింపుల అంశంలో దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విచారణ చేపట్టిన సభాపతి ఈ పిటిషన్‌లను కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ ఇటీవల తీర్పును వెలువరించింది.

బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. దానంపై అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

**అలా చేయడం స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని వదులుకున్నట్లే**

బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినందున స్వచ్ఛందంగా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని, కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం అన్నది పదో షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడం అవుతుందా లేదా అన్నదానిపై స్పీకర్ సమాధానమిచ్చారని హైకోర్టు తెలిపింది. శాసనసభ్యుడిగా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగపరంగా నిషేధించలేదని, ఒకవేళ మరో పార్టీ టిక్కెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించాల్సి వస్తే రాజ్యాంగం దాన్ని స్పష్టంగా పేర్కొని ఉండేదని, అలా నిర్దేశించనపుడు రాజ్యాంగ అనర్హతను నిర్ధారించలేమని స్పీకర్ పేర్కొన్నట్లు హైకోర్టు వివరించింది.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం



**మొదటి పేజీ తరువాయి...**

ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రధానంగా సర్ ప్రక్రియ చుట్టూ తలెత్తిన వివాదాలే ఈ పరిణామానికి కారణంగా నిలిచాయి. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పునరుద్ధరణ వంటి అంశాలపై ఎన్నికల కమిషన్‌లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని ఇటీవల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రిపోర్ట్ ప్రకారం- ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల వ్యవధిలోనే ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఇంకా కొన్ని సౌకర్యాలకు సంబంధించిన యాక్సెస్ కోసం గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, దిల్లీలోని ఎన్నికల సంఘం అధికారులను 7 రోజుల్లో 8 సార్లు సంప్రదించినప్పటికీ స్పందన రాలేదని మరో నివేదికలో తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.

**సీఈసీపై తృణమూల్ ఎంపీ ఫిర్యాదు**

మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా గురువారం దిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో సీఈఓ జ్ఞానేశ్ కుమార్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏకపక్ష నిర్ణయాలు, విధివిధానాల ఉల్లంఘన, ఓటరు జాబితాల్లో మార్పులకు సంబంధించి అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆమె ఆరోపణలు చేశారు. సీఈసీ అండ్ ఈసీ యాక్ట్ 2023 సెక్షన్ 16 కింద, ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లు కలిసి తీసుకునే ఉమ్మడి నిర్ణయాలకే చట్టపరమైన రక్షణ (ఇమ్యూనిటీ) వర్తిస్తుందని, ఒంటరిగా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్న సీఈసీకి ఈ రక్షణ వర్తించదని ఆమె వాదించారు.

కాంగ్రెస్ సీనియర్ నేత ప్రమోద్ తివారీ కూడా ఎన్నికల కమిషన్ తాజా నిర్ణయాలపై తీవ్రంగా విమర్శించారు. సీఈసీపై వస్తున్న ఆరోపణలకు ఎన్నికల కమిషన్ లేదా సీఈసీనే సమాధానం ఇవ్వాల్సి ఉండగా, బీజేపీ నేతలు ఎందుకు స్పందిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ నేత రణదీప్ సుర్జేవాలా డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఆయనపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ చేయాలని కోరారు. ఈ ఎస్ఐఆర్ కారణంగా 19 రాష్ట్రాల్లో ఏకంగా 13 కోట్ల మందిని ఓటరు లిస్ట్ నుంచి తొలగించారని, కర్ణాటకలోనే 1.08 కోట్ల పేర్లు తొలగించారని ఆరోపించారు. మరో 43 లక్షల మందికి నోటీసులు కూడా ఇచ్చారని మండిపడ్డారు.

సీఈసీని తొలగించడానికి ప్రతిపక్షాలు సిద్ధపడటం ఇదేం తొలిసారి కాదు. గతంలోనూ ఇది జరిగింది. ఈ ఏడాదే మార్చిలో ఒకసారి, మళ్లీ ఏప్రిల్‌లో కూడా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని నోటీసులు సమర్పించాయి. అయితే అప్పుడు సరైనంత సంఖ్యాబలం లేకపోవడం, ఇతర ప్రక్రియల నేపథ్యంలో అవి తిరస్కరణకు గురయ్యాయి. ప్రస్తుతం మరోసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి.

**అంత సులభమేం కాదు!**

ఇక అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని పదవీకాలం పూర్తికాకముందే తొలగించాలనే ప్రతిపాదనను పార్లమెంటులో ప్రవేశపెట్టడాన్ని అభిశంసన తీర్మానం అంటారు. అయితే భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలంటే అనుసరించాల్సిన ప్రక్రియ కూడా చాలా కఠినంగానే ఉంటుంది. పార్లమెంట్ ఉభయసభల్లోకి వచ్చే అభిశంసన నోటీసును ముందుగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ ఛైర్మన్ పరిశీలించి, నోటీసును అంగీకరిస్తే వచ్చిన ఆరోపణలపై విచారణకు ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేస్తారు. విచారణ జరిపి, ఆరోపణల్లో నిజం ఉందని నివేదిక ఇస్తేనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తారు. అక్కడ మళ్లీ మూడింట రెండొంతుల మెజార్టీతో తీర్మానానికి ఆమోదం లభించాలి. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదం కూడా లభించాలి.

# నేడు అత్యంత భారీ వర్షాలు

**మొదటి పేజీ తరువాయి...**

నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సోషల్ మీడియా వేదిక ద్వారా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 8:30 నుంచి గురువారం ఉదయం 7:00 గంటల మధ్య రాష్ట్రంలోని 80 ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు పైగా /వర్షపాతం నమోదైంది. అత్యధికంగా విశాఖపట్నం రూరల్ పరిధిలోని తులసినగర్‌లో 236 మి.మీ. రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. మధురవాడలో 218 మి.మీ., ఎండాడలో 210 మి.మీ., సీతమ్మధారలో 205 మి.మీ. చొప్పున వర్షం కురియడంతో విశాఖ నగరం జలమయమైంది. తీవ్ర

వాయుగుండం నిన్న రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటింది. దీని ప్రభావం మరో 12 గంటల పాటు కొనసాగి, ఆ తర్వాత క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని పలు చోట్ల శుక్రవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు.

**జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసిన చంద్రబాబు**

ఏపీలో తీవ్ర వాయుగుండం కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన అత్యవసర టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సహాయక చర్యలు, ముందస్తు ప్రాణ నష్ట నివారణ చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వాతావరణం పూర్తిగా అనుకూలించి వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఏ ఒక్క అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదని సూచించారు. జలాశయాలు, నదుల్లో పెరుగుతున్న నీటిమట్టాలను, ఇన్-ఫ్లోలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులదేనని తేల్చి చెప్పారు. వరద ముంపునకు గురైన బాధితులకు నాణ్యమైన ఆహారం, మంచినీరు, అత్యవసర వైద్య సదుపాయాలు మందులు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. ఈదురు గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు.

అంతేకాకుండా, వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టంపై కచ్చితమైన అంచనాలు రూపొందించి నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా నిలుస్తుందనే నమ్మకం కలిగించాలని కలెక్టర్లకు తేల్చి చెప్పారు.

**పలు విమానాల దారి మళ్లింపు**

తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో ఉత్తరాంధ్రను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. మరోవైపు భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణం కారణంగా ఏపీలోని ప్రధాన విమానాశ్రయాలలో విమాన రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. రన్‌వేలపై భారీగా నీరు చేరడం, దట్టమైన మేఘాలు ఆవరించడంతో విమానాశ్రయ అధికారులు పలు సర్వీసులను దారి మళ్లించడంతో పాటు మరికొన్నింటిని రద్దు చేశారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి దారి మళ్లించగా, హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వెళ్లాల్సిన స్టార్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. వాతావరణ పరిణామాలు అనుకూలించని దృష్ట్యా ప్రయాణికులు తమ విమాన సమయాలు, రాకపోకల తాజా సమాచారాన్ని ఆయా ఎయిర్‌లైన్స్ సంస్థల ద్వారా ముందస్తుగా సరిచూసుకోవాలని విమానాశ్రయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

**విశాఖలో ప్రధాన రహదారుల జలమయం**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కళింగపట్నం వద్ద తీరం దాటింది. దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వేకువజాము నుంచి పడుతున్న వర్షాలకు విశాఖపట్నం నగరం జలదిగ్బంధంలో చిక్కుకోగా, రికార్డు స్థాయిలో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విశాఖ ఎయిర్‌పోర్టు రన్‌వే పరిసరాల్లో 18 సెం.మీ, కాకినాడ, విజయనగరంలో 13 సెం.మీ, కళింగపట్నం, తునిల్లో 5 సెం.మీ మేర వర్షపాతం రికార్డయింది. విశాఖలోని ప్రధాన రహదారులు జలమయం కావడంతో ట్రాఫిక తీవ్రంగా స్తంభించింది. డ్రైనేజీలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వాయుగుండం తీరం దాటినప్పటికీ భూభాగంపై ప్రభావం కొనసాగుతుండటంతో రాగల కొన్ని గంటల్లో ఉత్తరాంధ్రలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. జీవీఎంసీ, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపడుతుండగా, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు

ఇవాళ శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలకు రెడ్ అలర్ట్ చేసింది వాతావరణ శాఖ. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. గురువారం అల్లూరి, ఏలూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ నెల 25న అల్లూరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**తెలంగాణలో వాతావరణం**

తీవ్ర వాయుగుండం ప్రభావం తెలంగాణపై కూడా కనిపిస్తుంది. బుధవారం అతి భారీ వర్షాలు, గురు, శుక్రవారాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ వరంగల్, ఖమ్మం జిల్లాలతో పాటు పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, నల్గొండ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.



## బొల్లారంలో చెత్త వర్గీకరణపై అవగాహన కార్యక్రమం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 24(నమస్తే ఉదయం)**

స్వచ్ఛతా హి సేవా-2026 కార్యక్రమంలో భాగంగా అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు బొల్లారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో గురువారం చెత్త వర్గీకరణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వేస్ట్, డొమెస్టిక్ హజార్డస్ (ప్రమాదకర) వేస్ట్‌గా విడివిడిగా వేరు చేసి స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు అందించాలని సూచించారు. చెత్తను సరిగా వర్గీకరించడం వల్ల పారిశుధ్య నిర్వహణ మరింత సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. అనంతరం ఇళ్లలోనే లభించే తడి చెత్త (కూరగాయల వ్యర్థాలు, మిగిలిన ఆహారం తదితరాలు) సహాయంతో హోమ్ కంపోస్టింగ్ (ఇంటి వద్దే వర్మీ కంపోస్ట్ తయారీ) ఎలా చేసుకోవాలో ప్రజలకు ప్రత్యక్షంగా వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హరీష్, ఆర్‌పిలు సబిత, సావిత్రి, అజ్మీర్‌తో పాటు కాలనీల మహిళలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారులకు అందజేసిన బండి రమేష్

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమంలో భాగంగా గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీహేమ దుర్గా భవన్ లో చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం ఏబీవీ పురం నివాసి లక్ష్మి, భర్త కిషోర్ కు రూ. 43,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ , కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, మస్తాన్ రెడ్డి, రంగా మోహన్, వాసు తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు

**మొదటి పేజీ తరువాయి...**

జరిగే బడాగణేశ్ నిమజ్జన ఘట్టాన్ని వీక్షించేందుకు ట్యాంక్‌బండ్‌కు 700 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. శోభాయాత్ర సాఫీగా సాగేందుకు 20వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తుండగా, 10వేల కెమెరాలు..24 అత్యాధునిక డ్రోన్లతో నిఘా పెట్టనున్నారు. గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. గణేశ్ శోభాయాత్రకు గ్రేటర్ సర్వం సిద్ధమైంది. మండపాలలో విశిష్ట పూజలు అందుకున్న గణనాథులను గంగమ్మ ఒడికి తరలించేందుకు భక్తులు సిద్ధమయ్యాయి. ఇప్పటికే చెరువులు, బేబీ పాండ్స్ వద్ద నిమజ్జన కోలాహలం నెలకొంది. ఇందులో భాగంగా నిమజ్జన ప్రక్రియ తుది ఘట్టానికి చేరుకున్న నేపథ్యంలో బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్, ఖైరతాబాద్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు జరిగే భారీ గణనాథుల శోభాయాత్ర అత్యంత ప్రాధాన్యతను సంతరించుకోనున్నది.

# బీఆర్ఎస్ నాయకుల కేటీపీఎస్ సందర్శన

**పాల్వంచ, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**



చేతగాని దద్దమ్మ ప్రభుత్వంలో వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నదని,రైతాంగం నిర్వేదంతో,బాధల్లో ఉన్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయానికి సాగునీళ్లు, విత్తనాలు, కరెంట్,యూరియా సక్రమంగా సరఫరా చేయకుండా ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పాలకులపై ఆయన మండిపడ్డారు.బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, కార్యనిర్వహక అధ్యక్షులు కే.టీ.రామారావుల పిలుపు మేరకు ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యాన గులాబీ శ్రేణులు గురువారం పాల్వంచలోని కేటీపీఎస్ సందర్శనకు వెళ్లారు.థర్మల్ పవర్ స్టేషన్ లో బొగ్గు నిల్వలు, విద్యుదుత్పత్తికి సంబంధించి వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు, రైతులు వెడుతుండగా పెద్ద సంఖ్యలో వటరీహరించిన పోలీసులు బ్యారీకేడ్స్ అడ్డుపెట్టి నిలువరించారు.ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకోగా పలువురు స్వల్పంగా గాయపడ్డారు.ఆ తర్వాత ఎంపీ వద్దిరాజు నేతృత్వంలో ప్రతినిధి బృందం కేటీపీఎస్ లోపలికి వెళ్లి బొగ్గు నిల్వల్ని, విద్యుదుత్పత్తిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేస్తున్న తీరును దుయ్యబట్టారు.సాగునీటు ,,కరెంట్ సక్రమంగా సరఫరా చేస్తే పంటలు పండుతాయని, వాటిని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి వస్తుందని..వాటిని నెరవేర్చడం చేతగాకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని,రైతన్నల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు.కేసీఆర్ సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాక బంగారుమయంగా తీర్చిదిద్దారని, తీవ్ర నష్టాలలో సింగరేణి సంస్థను లాభాల బాట పట్టించారని ఎంపీ రవిచంద్ర కొనియాడారు.థర్మల్ పవర్ స్టేషన్లు సింగరేణి సంస్థకు సుమారు 55వేల కోట్ల రూపాయలు బకాయి పడ్డాయని,నాణ్యమైన 9,10 జీ బొగ్గు సరఫరా లేక,మిషనరీ కూడా పాతబడిపోవడంతో విద్యుదుత్పత్తి నిలిచిపోయిందని అధికారులు చెప్పారన్నారు.నాణ్యమైన బొగ్గును ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర లకు సరఫరా చేస్తూ విద్యుత్ శాఖ చూస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇక్కడి కేటీపీఎస్,బీటీపీఎస్ లను ఏ మాత్రం కూడా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.పవర్ స్టేషన్ లో సరిపడు బొగ్గు నిల్వలు లేవని,ఉన్నవి కూడా నాణ్యత లేని 13,14 జీ రకానివి అని,9,10 జీ రకం ల్యాబ్ లో ఉన్నట్లు అధికారులు తనతో అనడం శోచనీయమని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే కరెంట్ ఉండదని,తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిన దుస్థితి నెలకొంటుందని కొందరు నాయకులు అవహేళన చేశారన్నారు.కేసీఆర్ ముందుచూపు,పక్కా ప్రణాళికతో విద్యుదుత్పత్తి 7వేల నుంచి 20వేల మెగావాట్లకు పెంచి చూపి విమర్శకుల నోళ్లు మూయించారని ఎంపీ రవిచంద్ర వివరించారు.కేసీఆర్ పాలనలో సాగునీళ్లు, విద్యుత్, విత్తనాలు, యూరియా,రైతుబంధు ద్వారా పెట్టుబడి అందడంతో,పంటలు సమృద్ధిగా పండడం, ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడంతో రైతన్నలు,ప్రజలు సంతోషంగా జీవించారన్నారు.ఈ కాంగ్రెస్ పాలనలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తమ కష్టాలన్నీ తీరుతాయని ఎదురు చూస్తున్నారని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.అంతకుముందు ఎంపీ రవిచంద్ర తదితర ప్రముఖులు భారతరత్న డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్, దివంగత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రాం విగ్రహాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కేటీఆర్ పిలుపు మేరకు వద్దిరాజు నేతృత్వంలో వనమా ఆధ్వర్యాన వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు కేటీపీఎస్ వద్దకు తరలివచ్చి పంటలు ఎండిపోకుండా నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలంటూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్,కాపు సీతామహాలక్షీ, వేల్పుల దావటరీదర్,గోవాడ గుణచరిత్,బత్తుల మధుచంద్,సింధూతపస్వి,మల్లెల రవిచంద్ర,రాజు గౌడ్,లావుడ్య సత్యనారాయణ, చింతలపూడి జగన్, బండారు రుక్మేందర్, అనుదీప్,నవతన్,భూపతి శ్రీనివాసరావు,అన్వర్,సంగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ హ్యాపీ హోమ్స్ కాలనీలో

# ఓ యువకుని దారుణ హత్య

**బుద్వేల్, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం) :**

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు దారుణ హత్య కు గురైనాడు. వివరాలను ఇన్స్ పెక్టర్ వెంకటేష్ వెల్లడించారు. ఉప్పర్ పల్లి హ్యాపీ హోమ్స్ లో నివాసం ఉంటున్న వసీం (28) అనే యువకుడిని అతని స్నేహితులే అతి కిరాతకంగా కత్తులతో పొడిచి చంపారు.




హత్యకు గురైన వసీం

**హత్యకు కారణాలు :**

పోలీసుల ప్రాథమిక విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. వసీంతోపాటు నిందితులపై గతంలో ఎన్ డి పి ఎస్ (డ్రగ్స్) కేసులు ఉన్నాయి. అందరూ కలిసి డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే తాము డ్రగ్స్ అమ్ముతున్న విషయాన్ని వసీం పోలీసులకు లీక్ చేస్తున్నాడని అనుమానంతో అతనిపై స్నేహితులు సోహెబ్ (26), , ఇలియాస్ (27) లు పై కక్షపెంచుకున్నారు.

**ఘటన ఎలా జరిగింది :**

నిన్న రాత్రి స్నేహితుల మధ్య వాగ్వాదం జరిగింది. మాట మాట పెరగడంతో ఇద్దరు నిందితులు సోహెబ్, ఇలియాస్ లు గురువారం సాయంత్రం వసీంపై కత్తులతో దాడి చేసి విచక్షణారహితంగా పొడిచి చంపారు. తీవ్ర రక్త స్రావంతో వసీం అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పరారీలు ఉన్న నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



# ఆల్విన్ కాలనీలో అన్నదానంలో పాల్గొని భక్తులకు వడ్డించిన కాంగ్రెస్ నేత పట్వారీ శశిధర్

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ బ్లాక్-72 నివాసులు మరియు రాజీవ్ గాంధీ నగర్ శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో 124 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ పెద్దలు, భక్తులతో కలిసి గణనాథుడిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వినాయకుడిని, కలశాన్ని కదిలించి నిమజ్జన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.అనంతరం మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు, స్థానికులకు స్వయంగా భోజనం వడ్డించారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, కాలనీవాసులు, భక్తులు, టీం పట్వారీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో సాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

## పలు మండపాల్లో పూజల్లో పాల్గొన్న జిల్లా గణేష్ నేత

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో వినాయక నవరాత్రుల సందర్భంగా పలు వినాయక మండపాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో జిల్లా గణేష్ నేత పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులసీ నగర్, ఎన్టీఆర్ నగర్, పీజేఆర్ నగర్, నవోదయ కాలనీ, పాపమ్మ బస్తీ, దత్తాత్రేయ కాలనీ, శంశిగూడ తదితర ప్రాంతాల్లోని వినాయక మండపాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం, అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.నవరాత్రులు స్వేచ్ఛా వాతావరణంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా భక్తిశ్రద్ధలతో దిగ్విజయంగా జరుపుకోవడం శుభపరిణామమని, నిమజ్జన కార్యక్రమంలో కూడా ఎలాంటి గొడవలకు తావు లేకుండా మండప కమిటీ సభ్యులు చొరవ తీసుకుని విఘ్న వినాయక ఊరేగింపు కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో మండప కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# గాయత్రీ నగర్ వినాయక నవరాత్రోత్సవాల్లో పాల్గొన్న ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 24(నమస్తే ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ గాయత్రీ నగర్ లో జరిగిన వినాయక నవరాత్రోత్సవాల్లో జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.తర్వాత నిర్వాహకులు ఏర్పాటు చేసిన మహా అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు స్వయంగా తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నానని, ఇలాంటి ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు అభినందనలు అని ఆయన తెలిపారు.కార్యక్రమంలో శ్రీనివాస గోవిందా, పవన్ కిషోర్, పులిగొల్లా శ్రీను, జీవీ ప్రసాద్, హరి, కేశవరావు, ప్రసన్న ఆంజనేయులు, జనసైనికులు, వీరమహిళలు, భక్తులు పాల్గొన్నారు.



యువకునికి కౌన్సిలింగ్ ఇస్తున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య

# ఆత్మ హత్య చేసుకోవాలని ప్రయత్నించిన యువకునికి కౌన్సిలింగ్ ఇచ్చి కాపాడిన అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య

**బుద్వేల్ , సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం) :**

గురువారం మధ్యానం అంటే గంటలకు అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ సీతయ్య కు ఓ వ్యక్తి ఫోన్ చేసి తన స్నేహితుడు అయిన బాను ప్రకాష్ ఆత్మహత్య చేసుకుంటానని తనతో తో చెప్పాడని తెలిపారు. వెంటనే ఇన్స్ పెక్టర్ తన సిబ్బంది అజ్మత్ అలీ, అహ్మెద్ కి సమాచారం ఇచ్చారు . వారు బాను ప్రకాష్ పంపిన ప్రదేశానికి వెళ్ళినారు. ఆ సమయం లో బాను ప్రకాష్ ఆత్మహత్య చేసుకుంటుండగా అతనిని కాపాడి పోలీస్ స్టేషన్ కు తీసుకు వచ్చారు. ఇన్స్ పెక్టర్ సీతయ్య బాను ప్రకాష్ కు కౌన్సిలింగ్ ఇచ్చి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



పర్యావరణ గణపతి ని కాటేదాన్ లో నిమజ్జనం చేస్తున్న చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ నాయకులు బొక్క నరసింహ రెడ్డి, తోకల శ్రీశైలం రెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి లు

# కాటేదాన్‌లో పర్యావరణ గణపతి నిమజ్జనం

## పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

**బుద్వేల్, సెప్టెంబరు 24 (నమస్తే ఉదయం) :**

కాటేదాన్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పర్యావరణ వినాయక విగ్రహానికి గురువారం బీజేపీ మైలార్ దేవుపల్లి కార్యాలయంలో నిమజ్జనం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ నాయకులు బొక్క నరసింహ రెడ్డి, తోకల శ్రీశైలం రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విఘ్నాలను తొలగించి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం కలగాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు.



రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ పత్తి కుంట వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

# ఈ నెల 25న నిర్వహించనున్న వినాయక నిమజ్జనాలకు పత్తి కుంట వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి

## రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ పత్తి కుంట లో ఈ నెల 25న గణేష్ నిమజ్జనం సందర్భంగా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అనంత చతుర్దశి చివరి రోజు సందర్భంగా వినాయక నిమజ్జనాలు ఎక్కువ సంఖ్యలో జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఏర్పాట్లను గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఎస్ ఈ నరేందర్ గౌడ్, రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నరసింహ రెడ్డి , భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై శ్రీధర్, ఏ ఈ నరసింహ మూర్తి లు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి జలమండలి విస్తృత ఏర్పాట్లు

## భక్తుల కోసం 137 ప్రత్యేక తాగునీటి శిబిరాలు

## 90 బేబీ పాండ్స్ వద్ద కూడా తాగునీటి సదుపాయం

## 72 గంటలు అప్రమత్తంగా ఉండాలి: ఎండీ అశోక్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరాతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గణేష్ నిమజ్జనం నేపథ్యంలో ఈడీలు, డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలతో గురువారం ఆయన అధికారులకు ఆదేశించారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు నగరంతో పాటు జలమండలి మూడు రీజియన్ల పరిధిలో (ఓఆర్ ఆర్ వరకు) గా 137 ప్రత్యేక తాగునీటి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎండీ తెలిపారు. అదేవిధంగా నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసిన 90 బేబీ పాండ్స్ వద్ద కూడా తాగునీటి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గణేష్ శోభాయాత్ర జరిగే ప్రధాన మార్గాలతో పాటు ట్యాంక్‌బండ్, డా. బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం, పరిసర ప్రాంతాల్లో 12 ప్రత్యేక వాటర్ క్యాంపులు అందుబాటులో ఉంటాయన్నారు. ఇందుకోసం మొత్తం 40 లక్షల వాటర్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 3, 5, 7, 9వ రోజుల నిమజ్జనాల




సందర్భంగా ఓఆర్ఆర్ పరిధిలోని నిమజ్జన కొలనుల వద్ద జలమండలి తాగునీటి శిబిరాలను నిర్వహించింది. అవసరమైన ప్రాంతాల్లో డ్రమ్ముల ద్వారా కూడా మంచినీటిని అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**రీజియన్లలో ఆయా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పర్యవేక్షణ-నోడల్, రూట్ అధికారుల నియామకం:**

వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన తాగునీటి శిబిరాల నిర్వహణ, పర్యవేక్షణతో పాటు క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నోడల్ అధికారులను నియమించినట్లు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ప్రతి ఏరియాకు ప్రత్యేకంగా రూట్ అధికారులను నియమించామని పేర్కొన్నారు. జలమండలి పరిధిలోని మూడు రీజియన్లలో ఆయా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు) తమ పరిధిలోని ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నోడల్, రూట్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. శోభాయాత్ర జరిగే మార్గాల్లో వాటర్ లీకేజీలు, సీవరేజీ ఓవర్‌ఫ్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో సీవర్ జెట్టింగ్ యంత్రాలను సిద్ధంగా ఉంచాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పోలీసు, జీహెచ్ఎంసీ, హైడ్రా, ఉత్సవ కమిటీలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నగరవ్యాప్తంగా ఏర్పాటు చేసే అన్నదాన శిబిరాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని సరఫరా చేయనున్నారు. జలమండలి క్వాలిటీ అస్యూరెన్స్ టీమ్‌లు వాటర్ క్యాంపుల్లో తాగునీటి నాణ్యతను నిరంతరం పరిశీలించడంతో పాటు క్లోరిన్ స్థాయిలు నిర్ణీత మోతాదులో ఉండేలా పర్యవేక్షిస్తాయి. భక్తుల రద్దీ ఎంత ఉన్నా తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా, శోభాయాత్ర మార్గాల్లో వాటర్ లీకేజీలు, సీవరేజీ ఓవర్‌ఫ్లోలకు తావులేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రైవేట్ ఎస్టీపీల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

## అక్టోబర్ 1లోగా నమోదు పూర్తి చేయాలి: జలమండలి

## శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ

## ప్రైవేట్ ఎస్టీపీల సర్వే, జియో ట్యాగింగ్.. జలమండలి డేటాబేస్‌తో అనుసంధానం

## గార్డెనింగ్, పరిశ్రమలు, నిర్మాణాలు, క్లీనింగ్ అవసరాలకు శుద్ధి చేసిన నీరు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే ఉదయం)**

నగరంలో శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగాన్ని పెంచడంతో పాటు తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించి, నీటి సంరక్షణను మరింత బలోపేతం చేసేందుకు జలమండలి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. జలమండలి పరిధిలో ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ రెసిడెన్షియల్ కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలకు చెందిన అనేక మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. వీటిలో శుద్ధి చేసిన నీటిని సమర్థవంతంగా వినియోగించేందుకు ఒక క్రమబద్ధమైన వ్యవస్థను జలమండలి ఏర్పాటు చేస్తోంది. ఈ వ్యవస్థ ద్వారా ఎస్టీపీలలో శుద్ధి చేసిన నీటిని గార్డెనింగ్, పరిశ్రమల అవసరాలు, క్లీనింగ్, నిర్మాణ కార్యకలాపాలు తదితర తాగేతర అవసరాలకు వినియోగించేలా ప్రోత్సహించనున్నారు. తద్వారా అవసరమైన ప్రాంతాలకు సమీపంలోని ఎస్టీపీల నుంచి శుద్ధి చేసిన నీటిని అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ప్రైవేట్ ఎస్టీపీల సమగ్ర వివరాల నమోదు:**

ఈ కార్యక్రమంలో భాగంగా జలమండలి పరిధిలోని అన్ని ప్రైవేట్ ఎస్టీపీలను సర్వే చేసి, జియో ట్యాగింగ్ చేయడంతో పాటు వాటి వివరాలను జలమండలి డేటాబేస్‌లో నమోదు చేయనున్నారు. ప్రతి ఎస్టీపీకి సంబంధించి శుద్ధి సామర్థ్యం, రోజువారీ శుద్ధి చేసిన నీటి పరిమాణం, సి ఓ డి, బి ఓ డి, పీహెచ్, టి ఎస్ ఎస్ తదితర నీటి నాణ్యత ప్రమాణాలను నమోదు చేస్తారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తూ ఆసక్తి చూపే ప్రైవేట్ ఎస్టీపీలను శుద్ధి చేసిన నీటి నమోదిత సరఫరాదారులుగా గుర్తించనున్నారు.

నీటి నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా అనే అంశంపై జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తారు. నమోదైన ఎస్టీపీలకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ వద్ద అందుబాటులో ఉన్న శుద్ధి చేసిన నీటి పరిమాణాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసే అవకాశం కల్పించనున్నారు.

**ప్రధాన ప్రయోజనాలు:**


ఈ విధానం ద్వారా శుద్ధి చేసిన నీటిని అవసరమైన ప్రాంతాలకు సమీపంలోని ఎస్టీపీల నుంచి అందుబాటులోకి తీసుకురావచ్చు. తద్వారా మంచినీటిని తాగేతర అవసరాలకు వినియోగించడం తగ్గించడంతో పాటు నీటి వనరులపై ఒత్తిడిని తగ్గించవచ్చు. అలాగే ప్రైవేట్ ఎస్టీపీల పనితీరు, శుద్ధి చేసిన నీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ, ధ్రువీకరణకు అవకాశం ఏర్పడుతుంది.

**అక్టోబర్ 1లోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి:**

జలమండలి పరిధిలోని అన్ని ప్రైవేట్ ఎస్టీపీ నిర్వాహకులు 2026 అక్టోబర్ 1లోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి. రిజిస్ట్రేషన్ కోసం జలమండలి అధికారిక వెబ్‌సైట్‌లోనిత్వరిత లింక్‌లు → ప్రైవేట్ ఎస్ టి పి నమోదు విభాగాన్ని ఉపయోగించాలి. దరఖాస్తు సమయంలో కన్స్యూమర్ అకౌంట్ నంబర్, దరఖాస్తుదారు,సొసైటీ పేరు, ఎస్టీపీ సామర్థ్యం, సాంకేతిక వివరాలు, నిర్వహిస్తున్న నీటి నాణ్యత ప్రమాణాలు, జియో లొకేషన్, ఎస్టీపీ ఫొటోలు, ఈ పి టి ఆర్ ఐ ధ్రువీకరణ తదితర వివరాలను సమర్పించాలి. ప్రైవేట్ ఎస్టీపీ నిర్వాహకులు నిర్ణీత గడువులోగా నమోదు పూర్తి చేసి, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగాన్ని పెంచేందుకు జలమండలి చేపట్టిన ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు.

# సెప్టెంబర్ 30 నాటికి డిజిటల్ క్రాప్ సర్వే, రైతు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి

## రంగా రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం)**

వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే , రైతు నమోదు ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. చంద్రరెడ్డి ఆదేశించారు. అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ , కార్యదర్శి సూచనల మేరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లైస్, మీసేవ, సబ్ సెంటర్ల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలోని ముఖ్య విషయాలు:లి లివరి కొనుగోలు సెంటర్లు ప్రారంభం:లి అక్టోబర్ 1వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 30, 2026 నాటికి డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ. 500 బోనస్ వర్తించే 7 సన్న వరి రకాలు:లి ప్రభుత్వం గుర్తించిన లి(1) డి పి టి-5204, (2) ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), (3) ఏఎన్ఎం-1638, (4) కే ఎన్ ఎం-7715, (5) హెచ్ఎంటి సోనా, (6) జై శ్రీరామ్, (7) డబ్ల్యూ జి ఎల్-44లి అనే ఏడు రకాల సన్న వరి పంటలకు మాత్రమే క్వింటాలుకు రూ. 500 బోనస్ వర్తిస్తుందని, కొనుగోలు ప్రక్రియకు క్రాప్ సర్వే డేటా ఎంతో కీలకమని తెలియజేశారు.

రైతు నమోదు అవశ్యకత:లి ప్రభుత్వ పథకాల సబ్సిడీలు పొందడానికి ఎరువుల కొనుగోలు యాప్ లో బుకింగ్ చేసుకోవడానికి రైతు నమోదు సంఖ్య తప్పనిసరి.

**ప్రత్యేక క్యాంపులు, ప్రచారం:**

ప్రతి గ్రామంలో మీసేవ మరియు కామన్ సర్వీస్ సెంటర్ల భాగస్వామ్యంతో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని, అలాగే చాటింపు , ఫ్లెక్సీల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం. సుజాత, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎస్. స్వర్ణ, ఇతర శాఖల అధికారులు, మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్ల జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.




## ఖాజిపల్లి జిఎంఆర్ కాలనీలో

# శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 24( నమస్తే ఉదయం):**

గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజీపల్లి జిఎంఆర్ కాలనీ వాసులకు మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాలనీలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించేందుకు సంకల్పించినట్లు ఆర్కే ఫౌండేషన్ చైర్మన్, అడ్వకేట్ రమాకాంత్ దండె తెలిపారు. ఎన్నికల అనంతరం ఈ విషయమై మున్సిపల్ చైర్మన్ శ్రీమతి సుష్మా గణేష్ గాదె, కౌన్సిలర్ శ్రీ కుమార్ యాదవ్‌లను కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి సహకారంతో బస్‌స్టాప్ సమీపంలోని జిఎంఆర్ కాలనీ, సర్వే నంబర్ 181, ఖాజీపల్లి ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి బీరంగూడ అమ్మ నాన్న గుడి కాంట్రాక్టర్‌తో సంప్రదించి, తిరుపతి శైలిని ప్రతిబింబించేలా విశాలమైన ఆలయ నమూనా ను సిద్ధం చేయించినట్లు రమాకాంత్ దండె వెల్లడించారు. ఈ ఆలయం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైనది కాకుండా కాలనీ ప్రజలందరికీ చెందిన ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా ఒక గొప్ప ఆధ్యాత్మిక మైలురాయిగా ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆలయ నిర్మాణానికి కాలనీ ప్రజలు, భక్తులు, దాతలు తమ వంతు సహకారం, ఆశీస్సులు అందించాలని రమాకాంత్ దండె కోరారు. సేవాభావంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు

# బొల్లారం మల్లన్న బస్తీలో గణేశ్ లడ్డూ వేలంపాటలో రికార్డు ధర



**పటాన్ చెరు, సెప్టెంబర్ 24 (నమస్తే ఉదయం):**



బొల్లారంలోని మల్లన్న బస్తీలో టీం విశ్వనేత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశ్ లడ్డూ వేలంపాట రికార్డు స్థాయిలో ధర పలికింది. మల్లన్న బస్తీకి చెందిన దోమ శ్రీనివాస్ రెడ్డి ఒక్క లక్ష యాభై ఐదు వేల రూపాయలకు (₹1,55,000) ప్రధాన లడ్డూను దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే వేలంపాటలో లడ్డూ లక్ష రెండు వేల రూపాయలు (₹1,02,000) పలకగా, ఈ సంవత్సరం మరో 53 వేల రూపాయలు పెరిగి రికార్డు స్థాయికి చేరుకుంది. ఇది బొల్లారం ప్రాంత గణేశ్ ఉత్సవాల్లో గుర్తించదగిన ఘటనగా నిలిచింది. వేలంపాటలో మరో లడ్డూను అరవై వేల రూపాయలకు (₹60,000) తలారి కృష్ణ దక్కించుకున్నారు. అదేవిధంగా గణేశ్ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మణిహారం వేలంలో 36 వేల రూపాయలకు (₹36,000) యాదగిరి యాదవ్ సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొని వేలంపాటను విజయవంతం చేశారు. భక్తుల ఉత్సాహం, పోటీవేలం వల్ల లడ్డూ ధరలు గణణీయంగా పెరగడం గమనార్హం. టీం విశ్వనేత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వినాయక లడ్డూ వేలంపాట మల్లన్న బస్తీలో గణేశ్ ఉత్సవాలకు మరింత ఉత్సాహాన్ని నింపింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733